కుత్బుల్లాపూర్‌ను మరింత అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- 11వ రోజు కృతజ్ఞతా యాత్ర


కాలనీవాసులకు ధన్యవాదాలు తెలుపుతున్న వివేకానంద్

షాపూర్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మంగళవారం కృతజ్ఞతా యాత్రలో భాగంగా సూరారం డివిజన్‌లోని రాజీవ్‌గాంధీనగర్, శివాలయనగర్, మస్తానాబిల్డర్స్ ప్రాంతంలో 11వ రోజు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను మరోసారి భారీ మెజారిటీతో గెలిపించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలుపడానికే ఈ యాత్ర చేపట్టానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పి.భాస్కర్, సిద్ధిక్, ఫిరోజ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన శ్రీనివాస్, అజయ్, విజయ్, వెంకటేష్, రాజు, నర్సింహ పాల్గొన్నారు.

10 నుంచి కట్టమైసమ్మ జాతర

సూరారం కట్టమైసమ్మ, రేణుకాఎల్లమ్మ బోనాల జాతర పోస్టరును ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కార్పొరేటర్ సత్యనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. దేవాలయం వద్ద జరిగిన ఆలయ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 10నుంచి 12 వరకు జాతర జరుగుతుందని, 11వ తేదీన అమ్మ వారి ప్రధాన జాతర జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం మున్సిపల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి, సూరారం సీఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వీరారెడ్డి, రాఘవ రెడ్డి, సాయిగౌడ్, గణేష్, లక్ష్మారెడ్డి, మల్లేష్, భాస్కర్, మహిపాల్‌రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, మన్నె రాజు, తదితరులు పాల్గొన్నారు.

'మున్సిపల్ కార్మికులని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి'

దుండిగల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ దుండిగల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మంగళవారం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ప్రతినెలా సబ్బులు, కొబ్బరినూనెలు, ఆరోగ్య పరికరాలు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తన పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీఐటీయూ నాయకులు నర్సింహా, ఎల్లయ్య, సురేందర్, వెంకటేష్, మధు, రవి, జగన్, జయేందర్, అమృత, బాలమణి, సుశీల, సీఐటీయూ దుండిగల్ మండల కన్వీనర్ బి.లింగయ్య స్వామి ఉన్నారు.

సుభాష్‌చంద్రబోస్ జయంతి కార్యక్రమంలో..

పేట్‌బషీరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్యాన్ని తారస్థాయికి చేర్చిన మహాయోధుడు సుభాష్ చంద్రబోస్ అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని రంగారెడ్డినగర్ డివిజన్‌లోని వెంకట్‌రామిరెడ్డినగర్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే, కార్పొరేటర్లు బి.విజయ్‌శేఖర్‌గౌడ్, జగన్ హాజరై సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ నాయకులు శంకరయ్య, లక్ష్మణ్‌గౌడ్, రశీద్, లక్ష్మీనాథ్, భాస్కర్‌రెడ్డి, మల్లేష్‌చారి, సతీష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జగద్గిరిగుట్ట డివిజన్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, రంగారెడ్డినగర్, జగద్గిరిగుట్ట డివిజన్‌ల కార్పొరేటర్లు బి.విజయ్‌శేఖర్‌గౌడ్, జగన్ సంఘం సభ్యులతో కలిసి వెంకట్ రామిరెడ్డినగర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు బి.రాజేష్, బి.గోపాల్, జనార్దన్, నర్సింగ, లక్ష్మీనర్సింహులు, ప్రతాప్, దత్తాత్రేయ, ప్రభాకర్, రవీందర్‌బాబు, రాము, శ్రీనివాసు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈటల రాజేందర్, పక్కన కార్పొరేటర్ మహేందర్

హనుమాన్ విగ్రహం ఆవిష్కరణ

కూకట్‌పల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిర నిర్మాణంతో ఐదు దశాబ్దాల నాటి దేశ ప్రజల ఆకాంక్ష నెరవేరిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మూసాపేటలోని హనుమాన్ చౌక్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహాన్ని ఆయన సోమవారం రాత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, నాయకులు సంతోష్, జిల్లా గోపాల్, మహావీర్ భక్త మండలి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరద కాల్వ పనుల పరిశీలన


వరద కాల్వ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ పరిధిలోని డోవ కాలనీలో వరద కాల్వ నిర్మాణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోవ కాలనీలో వరద కాల్వ పనులతో వర్షాకాలంలో స్థానికులు ఎదుర్కొంటున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు కోటయ్య, మురళీ, ఆనంద్, గిద్దారెడ్డి, శ్రీనివాస్, యెలమంద, వర్క్ఇన్‌స్పెక్టర్ నవీన్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి గడపకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తాం'

రాయదుర్గం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నియోజవర్గంలోని ప్రతి గడపకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మాదాపూర్ ఇజ్జత్‌నగర్ వీకర్‌సెక్షన్ బస్తీలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం బస్తీలో చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రణాళికతో గ్రేటర్ హైదరాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్‌గౌస్, మహిపాల్ యాదవ్, కృష్ణగౌడ్, శ్రీనివాస్ గౌడ్, సాంబశివరావు, డివిజన్ అధ్యక్షులు సురేష్‌నాయక్, శ్యామ్, లోకేష్, కృష్ణనాయక్‌తో పాటు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారిణినికి ఆర్థిక సాయం


జ్యోతికి ఆర్థిక సాయం అందజేస్తున్న కొండా విజయ్‌కుమార్

రాయదుర్గం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హాకీ క్రీడాకారిణి, జాతీయ జూనియర్ మహిళ జట్టు సభ్యురాలు జ్యోతికి తెలంగాణ హాకి జట్టు అధ్యక్షుడు కొండా విజయ్ మంగళవారం రూ.20వేల నగదు ప్రొత్సాహం అందించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ హాకిక్రీడా రంగంలో తన నైపుణ్యంతో జాతీయ జూనియర్ మహిళ జట్టులో చోటు దక్కించుకుందని త్వరలోనే సీనియర్ జట్టులో చోటు దక్కించుకుంటుందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి హాకి ఉపాధ్యక్షుడు రెడ్డిప్రవీణ్‌రెడ్డి, నరాల మహేశ్వర్‌రెడ్డి, జ్యోతి తండ్రి శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిధుల సేకరణలో పాల్గొన్న సింక్రోని ఉద్యోగులు

'సేవ' కోసం సింక్రోనీ ఉద్యోగుల నిధుల సేకరణ

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమ వార్షిక డబుల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సింక్రోనీ ఉద్యోగులు పలు సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా మంగళవారం నోవాటెల్ హోటల్ వద్ద నిధుల సేకరణ చేపట్టారు. దాదాపు 400 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. రెండు వేల మందికి పైగా అల్పాదాయ వర్గాలకు చెందిన చిన్నారుల అభ్యున్నతికి కృషి చేస్తోన్న యు అండ్ ఐ ట్రస్ట్ చేపట్టిన కార్యక్రమానికి నిధులు సమీకరించారు. సింక్రోని సంస్థకు చెందిన సెంట్రల్ రీజనల్ ఎంగేజ్‌మెంట్ హబ్ (హైదరాబాద్)కు చెందిన ఉద్యోగులు తొమ్మిదేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఇందుకోసం నిధుల సేకరణ చేస్తున్నారు.


గాజులరామారంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న కూకట్‌పల్లి జెడ్సీ అభిలాష్‌అభినవ్, కార్పొరేటర్ రావుల శేషగిరి

- గాజులరామారం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి)


రెండోసారి మేడ్చల్, మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పన్నాల హరీ‌ష్‌రెడ్డిని కుత్బుల్లాపూర్ బీజేపీ నాయకులు మంగళవారం కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో బావిగడ్డ రవి, పత్తి రఘుపతి, టి.దుర్యోధనరావులు ఉన్నారు.

- షాపూర్‌నగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి)


ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు చెబుతున్న ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, తదితరులు

- హైదర్‌నగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి)


కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె జీవన్, సాయి కిరణ్, శివ, వేణు, విజయ్, సందీప్, నాగేందర్, అభిలాష్, శివసాయిలు ఉన్నారు.

- షాపూర్‌నగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి)

శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే గాంధీ


కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాయదుర్గం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం మాజీ కార్పొరేటర్ సాయిబాబాతో కలిసి గచ్చిబౌలి సాయివైభవ్ కాలనీ, ఐశ్వర్య కాలనీలో ఆయన పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. సాయిఐశ్వర్య కాలనీ నుంచి వచ్చే నాలా కుచించుకుపోవడంతో వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమై వరదముంపునకు గురవుతుందని త్వరలోనే నాలా విస్తర్ణ పనులు చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సాయివైభవ్‌కాలనీ, సాయిఐశ్వర్య, జైన్ అపార్టుమెంట్ చుట్టు పక్కల కాలనీలకు ఒక సబ్‌స్టేషన్ కావాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ శ్రీనివాస్, డీఈ రమేష్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, ఎలక్ట్రికల్ డీఈ గోపాలకృష్ణ, ఏఈ వేణుగోపాల్, ఏఎంహెచ్ఓ నరేష్‌నాయక్, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

సమస్యలు, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేకు వినతి

హైదర్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో చేపట్టాల్సిన పనులు, సమస్యలపై ఎమ్మెల్యే గాంధీని స్థానికులతో కలిసి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను స్వయంగా పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.


షేక్ అన్సారీకి పురస్కారం ప్రదానం చేస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి

'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి' వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌కు మీడియా ప్రతిభా పురస్కారం

చిక్కడపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యూస్‌చానల్ 'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి' వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్ షేక్ అన్సారీకి మీడియా ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేశారు. జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.శేషశయనారెడ్డి అన్సారీకి పురస్కారం ప్రదానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీడియాలో నాణ్యమైన ప్రసారాలకు తెరవెనుక పనిచేసే వారి సమష్టి కృషి కారణమన్నారు. కళాపోషకుడు రాజశేఖరరెడ్డి అధ్యక్షత వహించిన సభలో బి.నరసింహారావు, కె.విజయలక్ష్మి, రవికుమార్, కుసుమభోగరాజు పాల్గొనగా, సంస్థ చైర్మన్ గుదిబండ వెంకటరెడ్డి స్వాగతం పలికారు.

జాతీయ దేవరాయ నంది అవార్డుకు లక్ష్మయ్య ఎంపిక



షాపూర్‌నగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జాతీయ దేవరాయ నంది అవార్డుకు పీఎల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు పిల్లోడి లక్ష్మయ్య ఎంపికయ్యారు. అవార్డును శనివారం రవీంద్రభారతీలో నిర్వహించే కార్యక్రమంలో అందజేస్తారని లక్ష్మయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సామాజిక కార్యకర్తగా పల్లలు చదవాలి, ఆరోగ్యంగా ఉండాలనే ధ్యేయంతో స్వచ్ఛంద సంస్థను స్థాపించినట్లు ఆయన తెలిపారు.

ఐఎంటీలో హెచ్ఆర్ లీడర్‌షిప్ సదస్సు

హైదరాబాద్ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ(ఐఎంటీ)లో మంగళవారం 'ఎంపవరింగ్ ఫ్యూచర్ వర్క్‌ఫోర్స్.. స్ట్రాటజీస్ ఫర్ ఇన్‌క్లూజివ్ లీడర్‌షిప్' పేరుతో హెచ్ఆర్ లీడర్ షిప్ సదస్సు నిర్వహించారు. గ్రాన్యూల్ ఇండియా లిమిటెడ్ సీహెచ్ఆర్ఓ ప్రొఫెసర్ ఉమారావు గండూరి మాట్లాడుతూ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, హైబ్రిడ్ వర్క్ మోడల్, గ్లోబలైజేషన్ అత్యంత కీలక చోదకాలు కానున్నాయని పేర్కొన్నారు. రిమోట్‌వర్క్ ప్రభావం, గిగ్ ఎకానమీ వృద్ధి, ఆటోమేషన్ ఆవశ్యకతలను వెల్లడించారు. అకడమిక్ డీన్ ప్రొఫెసర్ వెంకట చక్రపాణి మాట్లాడుతూ హెచ్ఆర్ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో నాయకత్వ పాత్ర గురించి వివరించారు. లాయిడ్ బ్యాంకింగ్ గ్రూప్ హెచ్ఆర్ హెడ్ డాక్టర్ విపుల్ సింగ్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్కృతిని తీర్చిదిద్దడంలో మానవ వనరుల పాత్రను వెల్లడించారు. కార్యక్రమంలో పలు సంస్థల వైస్ ప్రెసిడెంట్లు, హెచ్ఆర్ నిపుణులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


ఐడీఎల్ చెరువు నాలా వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జెడ్సీకి సూచించారు. మూసాపేటలోని జోనల్ కార్యాలయంలో మంగళవారం జెడ్సీ అభిలాష అభినవ్‌తో ఆయన సమావేశమయ్యారు. నాలాల అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న నాలా రిటర్నింగ్ వాల్స్ నిర్మాణ పనులు, పార్కులు, గ్రేవ్‌యార్డులు, రోడ్లకు సంబంధించిన పనులకు నిధులు మంజూరు చేసి త్వరగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నర్సింహయాదవ్, రవీందర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, మందడి శ్రీనివాసరావు, శిరీష పాల్గొన్నారు.

నాలా పరిశీలన..

కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు నుంచి బస్‌డిపోవరకు వెళ్లే నాలాను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులతో కలిసి పరిశీలించారు. నాలాకు రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టి వరదనీటి సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తి చేసి స్థానిక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ విభాగం ఈఈ నారాయణ, సిటీప్లానర్ ఉమాదేవి, జీహెచ్ఎంసీ ఈఈ సత్యనారాయణ, డీఈఈ ఆనంద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సుభాష్‌చంద్రబోస్‌కు ఘన నివాళి


సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జనసేన ఇన్‌చార్జి ప్రేమ్‌కుమార్, నాయకులు


సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

కూకట్‌పల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం కూకట్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి, మూసాపేట, కేపీహెచ్‌బీ కాలనీ, వీవీనగర్ ప్రాంతాల్లోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం రావడంలో సుభాష్‌చంద్రబోస్ పాత్ర ఎంతో కీలకమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ అన్నారు. యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

నల్లగండ్ల గ్రామంలో..

గచ్చిబౌలి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని మంగళవారం శేరిలింగంపల్లి నల్లగండ్ల గ్రామంలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకృష్ణయూత్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజ్ యాదవ్, గౌరవ అధ్యక్షులు మల్లికార్జున్‌యాదవ్, యాదగిరి, శివగౌడ్, విజేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజుముదిరాజ్, ప్రవీణ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

హాస్టల్స్‌లో ల్యాప్‌టాప్‌లు చోరీ

- ఇంజనీరింగ్ విద్యార్థి, మరొకరి అరెస్ట్
- 20 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

దుండిగల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై డబ్బు కోసం హాస్టల్స్‌లో ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థిని, అతని వద్ద కొనుగోలు చేసిన వ్యక్తిని బాలానగర్ ఎస్ఓటీ, దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ. 10 లక్షల విలువ చేసే 20 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. గాజులరామారం, భవానీనగర్‌లో నివాసముంటున్న ఈశ్వరయ్య కుమారుడు అపల బాలరాజు(20) ఎంఎల్ఆర్ఐటీలో బీటెక్ చదువుతున్నాడు. ఇతడికి హిమాయత్‌నగర్, అడ్వకేట్స్ కాలనీకి చెందిన క్యాసిఫై యాప్ నిర్వాహకుడు రాజ్‌కుమార్ కుస్వా (20) ఆన్‌లైన్‌లో పరిచయమయ్యాడు. గండిమైసమ్మ ప్రాంతంలోని హాస్టల్స్‌లో ల్యాప్‌టాప్‌లు దొంగిలించిన బాలరాజు వాటిని రాజ్‌కుమార్, పర్వేష్‌కుమార్ ద్వారా విక్రయించి డబ్బు సంపాదిస్తున్నాడు. సమాచారం అందుకున్న దుండిగల్, ఎస్ఓటీ పోలీసులు నిఘా పెట్టి బాలరాజు, రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. మరో నిందితుడు ప్రవీణ్‌కుమార్ పరారీలో ఉన్నాడు.

హాష్ ఆయిల్ విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

- రూ.12లక్షల విలువ చేసే 2లీటర్ల ఆయిల్ స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాసరావు

జీడిమెట్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హాష్ ఆయిల్‌ను నగరానికి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను బాలానగర్ ఎస్ఓటీ, సనత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.12లక్షల విలువచేసే 2లీటర్ల హాష్ ఆయిల్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా, కొత్తూరు మండలం, గురండి గ్రామానికి చెందిన అంపిలి బాలరాజు (29) మేస్త్రీ. మూసాపేట్, భవానీనగర్‌లో నివాసముంటున్నాడు. ఇతడు గతంలో ఓ హత్యకేసులో నిందితుడు, అనేక సార్లు గంజాయి విక్రయిస్తూ పట్టుపడ్డాడు. ఇటీవల సంక్రాంతికి తన సొంత గ్రామం వెళ్లిన బాలరాజు, విశాఖపట్నం, చింతపల్లి, వంజలూరు గ్రామానికి చెందిన వందలం నాగార్జున(21) ద్వారా 2లీటర్ల హాష్ ఆయిల్ కొనుగోలుచేసి నగరానికి తీసుకువచ్చాడు. పాత నేరస్థులు బోయిన్‌పల్లికి చెందిన మాడుగుల సతీష్ (24), బేగరి నగేష్ (28)లతో కలిసి ఫతేనగర్‌లో విక్రయించడానికి యత్నిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు ముగ్గురు వ్యక్తులను అరెస్ట్‌చేసి రూ.12లక్షల విలువ చేసే హాష్ ఆయిల్, రూ.1200 నగదు, 3సెల్ ఫోన్‌లు, బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. వీరికి హాష్ ఆయిల్ సరఫరా చేసిన నాగార్జున పరారీలో ఉన్నట్టు డీసీపీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో మేడ్చల్ ఎస్ఓటీ డీసీపీ శోభన్‌కుమార్, బాలానగర్ ఏసీపీ ఏ.గంగారాం, ఎస్ఓటీ సీఐ ఆర్.శ్యామ్‌సుందర్‌రెడ్డి, సనత్‌నగర్ సీఐ ఏ.సురేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

గాజులరామారం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కైసర్‌నగర్‌కు చెందిన ఓ మహిళ సూరారం పోలీస్ స్టేషన్‌లో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కైసర్‌నగర్‌లో రజిత, రాములు నివాసం ఉంటున్నారు. వారి ఇంటి పక్కనే ఉంటున్న రాములు బావ రామచందర్ ద్విచక్రవాహనం సీటు కాలిపోయింది. రాములే తగలపెట్టాడనే అనుమానంతో రామచందర్ సూరారం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు రాములుని పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. దీంతో మనస్తాపం చెందిన రాములు భార్య రజిత సూరారం పోలీస్ స్టేషన్‌లో పోలీసుల ముందే ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పు అంటించుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ మేరకు ఇరువురిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వస్త్ర వ్యాపారి ఆత్మహత్య

రాయదుర్గం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టం రావడంతో అప్పుల బాధ తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యచేసుకున్న సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుకు చెందిన ఎం.సతీష్‌చంద్ర(40) భార్య శ్రీవల్లి, కుమార్తెతో కలిసి బతుకుదెరువు కోసం గచ్చిబౌలికి వచ్చి పంచవటి కాలనీలో నివాసం ఉంటూ వస్త్ర వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో నష్టం వచ్చి అప్పులు ఎక్కువవడంతో మనస్తాపానికి గురై మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసైన యువకుడు...

గాజులరామారం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ప్రసన్న బేజా(31) బతుకుదెరువు కోసం వలసొచ్చి సూరారంలోని ఓ వసతి గృహంలో స్నేహితులతో ఉంటూ ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. బేజా గది తలుపులు ఎంతకీ తీయకపోవడంతో స్నేహితులు, వసతి గృహం నిర్వాహకులతో కలిసి సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి తలుపులు పగలగొట్టి చూడగా బేజా ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.